సాక్షి కర్నూలు

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



మహానందిలో పెళ్లిళ్ల సందడి

మహానంది: శుభముహూర్తాలు ఉండటంతో మహానందిలో వివాహాలు చేసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో క్షేత్రంలో కల్యాణ మండపాలు, వసతిగృహాలకు డిమాండ్ పెరిగింది.



ఎలుగుబంటి హల్‌చల్

మహానందిలో ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. కరివేన సత్రం ప్రాంగణంలోని కూల్‌డ్రింక్స్ షాపు వద్ద నుంచి నంది విగ్రహం వద్దకు చేరకుని అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది. IIలో



శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ

మాలోల నరసింహస్వామి సన్నిధి జీర్ణోద్ధరణ అష్టాబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో అహోబిల దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు. IIలో

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా మాధవి



నంద్యాలటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ ఆర్. మాధవి బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలనతో పాటు ఆన్‌లైన్ అటెండెన్స్‌ను పక్కాగా పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచి మాతాశిశు సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతుకు వజ్రం లభ్యం!

తుగ్గలి: జొన్నగిరి సమీపంలో పొలం పనులకు వెళ్లిన ఓ రైతుకు శుక్రవారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని శనివారం ఓ వజ్రాల వ్యాపారి రూ.40 వేలు, జత కమ్మలు ఇచ్చి కొనుగోలు చేసినట్లు తెలిసింది.

రేపు జెడ్పీలో స్పందన

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 4వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిల్లో స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

భువన మోహనుడికి బ్రహ్మారథం

- మంత్రాలయంలో అంగరంగ వైభవంగా మహారథోత్సవం
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు
- హెలికాప్టర్‌తో మహా రథంపై పూలవాన



అశేష భక్తజనం మధ్య సాగుతున్న మహారథోత్సవం

మంత్రాలయం: వేదభూమి పులకించింది.. పవిత్ర తుంగభద్ర నది పరవశించింది.. భక్త జన సందోహం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. పండితుల వేద మంత్రోచ్చారణలు.. కళాకారుల నీరాజనాల మధ్య శుక్రవారం మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామి మహారథోత్సవం రమణీయంగా సాగింది. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు భక్తజనం బ్రహ్మారథం పట్టగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విశిష్ట పూజలు చేశారు. రాఘవేంద్ర స్వామి 352వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తరారాధన పురస్కరించుకుని మహారథోత్సవం చేపట్టారు. హెలికాప్టర్‌పై నుంచి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పుష్పవృష్టి కురిపిస్తుండగా శ్రీక్షేత్రం వీధుల్లో ఉత్సవమూర్తి శోభాయమానంగా ఊరేగారు. ముందుగా ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను వేదపాఠశాలకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లి తొలిపూజ చేశారు. అక్కడి నుంచి ఉత్సవమూర్తి శ్రీమఠం మూల బృందావనం చేరుకోగా పీఠాధిపతి వసంతోత్సవానికి శ్రీకారం చుట్టారు. రథ చక్రాలకు, ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి అనుగ్రహ సందేశం అనంతరం మంగళహారతులు చేపట్టి మధ్యాహ్నం 12.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. డప్పు దరువులు, రంగుల ఆటలు, బ్రాహ్మణ మహిళల భజనలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు మధ్య రథోత్సవం అద్వితీయంగా సాగింది. శ్రీమఠం ఆలయం ముంగిట, ప్రధాన ముఖద్వారం చెంత హెలికాప్టర్ పైనుంచి రథంపై పూలవాన కురిపించారు. రాఘవేంద్ర సర్కిల్ చేరుకోగా పీఠాధిపతి పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు రథంపై కొలువుదీరిన మూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో రథోత్సవం శ్రీమఠం ప్రాంగణం చేరుకుని ముగిసింది.

ఉత్సవంలో ప్రముఖులు

రథోత్సవంలో కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బి. వరాలె, హైకోర్టు న్యాయమూర్తులు అశోక్ ఎస్.కణిగి, ఎం.జి. ఉమా, రామచంద్రన్ డి. హుద్దర్, శ్రీషానంద, రిటైర్డు జడ్జి శ్రీధరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సీతారామయ్య నేతృత్వంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్తరారాధన వేడుకల్లో భాగంగా యోగీంద్ర మండపంలో శనివారం రాత్రి డాక్టర్ రక్షాకార్తీక్ బృందం(బెంగళూరు) భరతనాట్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నీలిమ సుదర్శన్ కర్ణాటక సంగీత కచేరి వీనుల విందు చేసింది. బెంగళూరు ప్రభాత ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ బృందం నృత్య రూపక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



వేడుకలో పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తుల బృందం



మహిళల నృత్య ప్రదర్శన

మదినిండా మహానేత

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- మహానేతకు ఘన నివాళి అర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు
- ఊరూవాడా వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు
- ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ
- అనాథాశ్రమాల్లో అన్నదానాలు, పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు



పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు



దేవనకొండలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం తదితరులు



కోడుమూరులో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు(సెంట్రల్): దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం పాలాభిషేకాలు, జలాభిషేకాలు చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంచిపెట్టారు. అనాథశ్రమాల్లోని అభాగ్యులకు అన్నదానాలు చేశారు. వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని స్మరించుకున్నారు. మహానేత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ర్యాలీలు నిర్వహించారు.

➡ ఆలూరు నియోజకవర్గం దేవనకొండలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి సభకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రజలకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు,వైఎస్సార్‌సీపీ నాయకురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొన్నారు.

➡ కర్నూలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. వ్యవసాయ సలహా మండలిజిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ కర్నూలు నగరంలోని ఎస్‌టీబీసి సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలుపంచి పెట్టారు.

➡ కల్లూరు మండలం శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌తో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. మేయర్ క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య కలసి 35 మంది వృద్ధులకు వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేశారు.

➡ కోడుమూరు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే సుధాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు బ్రెడ్డును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి బీసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 1000 మందికి ఉచితంగా మందులను అందజేశారు.

➡ ఆదోని పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకముందు మహానేత విగ్రహానికి జలాభిషేకంచేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పాల్గొన్నారు.

➡ ఎమ్మిగనూరు పట్టణంలో ఎమ్మెల్యే తనయుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రుద్రగౌడ్, మునిసిపల్ చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

➡ వెల్దుర్తిలో జరిగిన వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరయ్యారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పత్తికొండలో వైఎస్సార్ విగ్రహానికి పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



హైదరాబాద్‌లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు



వెల్దుర్తిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఆదోని ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్



కోడుమూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): సాగునీటి సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో వచ్చిన విజ్ఞప్తులపై దృష్టి సారించాలని నీటి ఎద్దడి తలెత్తనీయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి వివిధ అంశాలపై కలెక్టర్లు, జేసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాతావరణ పరిస్థితులు అనువుగా లేకపోవడంతో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పంటల ఈ క్రాప్ బుకింగ్‌ను సెప్టెంబర్ 15వతేదీలోపు పూర్తి చేయాలన్నారు. జగనన్న పాల వెల్లువ రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమాకాంత్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య పాల్గొన్నారు.

'పది' ఫెయిల్ విద్యార్థులు 15లోపు ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: గతేడాది పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యేందుకు ఈ నెల 15వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 21 నుంచి 25వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుంతో 26 నుంచి 30వ తేదీ లోపు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రుసుం అవసరమయితే రూ.80 చెల్లించాల్సి ఉందని తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

వీబీఆర్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం



వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్)లో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. మృతదేహం ఒడ్డుకు రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి 35–40 ఏళ్ల వయసు ఉంటుందని, ఆమె చేతి మీద సుజాత అనే పచ్చబొట్టు ఉందని ఎస్‌ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101183, 9121101181కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ వెంకట ప్రసాద్ తెలిపారు.

అపస్మారకస్థితిలో మహిళ



డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి

డోన్ రూరల్: ఓబులాపురం గ్రామం మిట్ట వద్ద ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం ఓ మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండటంతో పోలీసులు డోన్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్యాపిలి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన జ్యోతి వరంగల్‌లో ఉన్న తమ బంధువులను చూసేందుకు వరంగల్‌కు వెళ్తున్నట్లు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరింది. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లిందో తెలియదు కానీ శనివారం పెట్రోల్ బంక్ సమీపంలో గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆమె వద్ద చీటిలో భర్త చంద్రశేఖర్ ఫోన్ నంబర్ ఉండటంతో పోలీసులు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఆమె కోలుకున్నాక పూర్తి సమాచారం అందిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ

ఆళ్లగడ్డ: అహోబిలంలోని నవనరసింహ క్షేత్రాల్లో ప్రధాన క్షేత్రమైన మాలోల నరసింహ స్వామి వారి సన్నిధి జీర్ణోద్ధరణ సందర్భంగా శనివారం అష్టాబంధన మహాసంప్రోక్షణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మాలోల నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీసుదర్శన హోమం జరిపారు. మధ్యాహ్నం 473 కలశముల ఉత్త మోత్తమ స్నపనం నిర్వహించారు. సాయంత్రం చతుస్థానార్చనం, హోమం, తత్త్వ హోమం, తత్త్వ న్యాసం, పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ పూజలు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జీవాల పెంపకంతో లాభాలు

కల్లూరు: జీవాల (గొర్రెలు, మేకల) పెంపకంలో లాభాలు గడించవచ్చునని ఏపీ గొర్రెల, మేకల అభివృద్ధి కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ జిన్నేటి ప్రకాశం యాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దామోదరం నాయుడు సూచించారు. శనివారం పెద్దటేకూరు గ్రామం రైతు భరోసా కేంద్రంలపశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యులు ఏడీఐఎస్‌డీపీ డాక్టర్ సుభాన్‌బాషా, వీఎఎస్, ఐఎస్‌డీపీ శ్రీనివాసరెడ్డి, కల్లూరు ఏడీ పార్థసారథి, చిన్నటేకూరు పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏహెచ్‌ఏ సౌజన్య, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

క్రీడా సంబరాలను విజయవంతం చేద్దాం

- అక్టోబరు 2 నుంచి నవంబర్ 8 వరకు 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు
- క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి
- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలను విజయవంతం చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ఆ మేరకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా, నియోజకవర్గ ఆర్గనైజింగ్ కమిటీలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో 'ఆడుదాం ఆంధ్ర'' క్రీడా సంబరాలపై సంబంధిత అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడా సంస్కృతిని పెంపొందించాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 2వ తేదీ నుంచి నవంబర్ 8వ తేదీ వరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరిట క్రీడా పోటీలు నిర్వహించనుందన్నారు. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర క్రీడలతో పాటు ఇతర సంప్రదాయ గ్రామీణ క్రీడలను కూడా మిళితం చేసి పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలలో 15 సంవత్సరాలు నిండిన యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ క్రీడల్లో పాల్గొనకూడదని వారు కేవలం ఆర్గనైజర్లుగా మాత్రమే వ్యవహరించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడల ప్రాధాన్యతను వివరించేలా అవగాహన కార్యక్రమాలను రూపొందించాలన్నారు. సమావేశంలో సెట్కూర్ సీఈఓ రమణ, క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, సీపీఓ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి గైర్హాజరైన ఆర్‌ఐఓ, డీవీఈఓ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జేసీ డీఎస్డీఓను ఆదేశించారు.

- అక్టోబర్ 2 నుంచి 7 వరకు గ్రామ వార్డు స్థాయిలో, 10 నుండి 19వ తేదీ వరకు మండల స్థాయిలో, 22 నుండి 25వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిల్లో, 28 నుండి 31వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసిందన్నారు.
- క్రీడలకు సంబంధించిన కిట్లను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు.
- క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మైదానాలు, పీఈటీలు, పీడీఎస్, అంపైర్లను గుర్తించాలని డీఈవో సుధాకర్ రెడ్డిని ఆదేశించారు.
- క్రీడా ప్రదేశాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లను ఏర్పాటు చేసుకోవాలని డీఎంహెచ్‌వో వెంకటరమణకు సూచించారు.
- ఆయా క్రీడా ప్రదేశాల్లో మంచినీటి వసతి, ఆహార పదార్థాల ఏర్పాటుకు ఆర్డబ్ల్యూఎస్, సివిల్ సప్లై, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- క్రీడాదుస్తులు, క్యాప్స్, బ్యానర్స్ తదితర ఏర్పాట్లకు సంబంధించి దాతల నుంచి విరాళాలు సేకరించాలన్నారు.

మహానందిలో ఎలుగుబంటి హల్‌చల్



నంది విగ్రహం సమీపంలో ఎలుగుబంటి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిధిలో శనివారం తెల్లవారుజామున ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. నల్లమల అడవి నుంచి ఎలుగుబంటి ఆలయ పరిసరాల్లో సంచరించడంతో భక్తులు, స్థానికులు భయాందోళన చెందారు. కరివేన సత్రం, ముందున్న కూల్‌డ్రింక్‌షాపుల వద్ద ఎలుగుబంటి కనిపించడంతో స్థానికులు కేకలు వేయడంతో పరుగులు తీస్తూ పెద్దనంది విగ్రహం వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి టీటీడీ వెనుక, షాపింగ్ కాంప్లెక్స్ వైపు నుంచి నల్లమలలోకి వెళ్లిపోయింది. మహానందీశ్వరస్వామి దర్శనం తెలవారుజామునే ఉంటుంది కాబట్టి దేవస్థానం సిబ్బంది మైకుల ద్వారా భక్తులను అప్రమత్తం చేశారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డి, ఎఫ్‌బీఓ ప్రతాప్‌లు నంది విగ్రహం, ఎలుగుబంటి సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. రాత్రి ఇక్కడే ఉండి మరోసారి పరిశీలించనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో మేకల గుంపు వద్దకు ఓ ఎలుగుబంటి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడు రోజుల వ్యవధిలో మహానంది పరిసరాల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి ఒకటేనా.. వేర్వేరు అనేది గుర్తించి చర్యలు తీసుకుంటామని అటవీ అధికారులు తెలిపారు.

వివాహానికి వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో సుధాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: బంధువుల వివాహానికి వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదబారిన పడగా, అందులో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బనగానపల్లె మండల పరిధిలోని రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామిరెడ్డి వివరాల మేరకు.. చాగలమర్రి మండలం చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన ఎం. సుధాకర్(30)తో పాటు అదే గ్రామానికి చెందిన నరసింహ, గురుచరణ్ అవుకు మండలం వేములపాడు గ్రామంలో తమ బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో బనగానపల్లె మండలం రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో అవుకు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా, నరసింహ, గురుచరణ్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి వెంటనే వైద్యశాలకు చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. క్షతగాత్రులను నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అంబులెన్స్‌లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ రామిరెడ్డి ప్రమాదం సంఘటన స్థలాన్ని పరిశీలించ పరిశీలించి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య సుజాతమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన నరసింహా, గురచరణ్

పెద్దాసుపత్రిలో స్టేషనరీ క్లర్క్ సస్పెన్షన్

కరన్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్లర్క్/జూనియర్ అసిస్టెంట్ ఎ. శ్రీనివాసులును ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి సస్పెండ్ చేశారు. ఇటీవల సదరు క్లర్క్ రూ.4.5లక్షలకు సంబంధించిన బిల్లులు మంజూరు కోసం తీసుకురాగా వివరాలు ఆరా తీశారు. ఈ విషయమై నీళ్ల నమలడంతో అనుమానం వచ్చి ఫైళ్ల తనిఖీ చేశారు. స్టేషనరీ కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఎక్కడా ఎంట్రీ లేక పోవడం, సరైన బిల్లులు లేకపోవడం, స్టాక్ రసీదు, రిజిస్టర్ నమోదులకు సంబంధించిన వ్యత్యాసాలు ఉండటంతో అనుమానం మరింత అధికమైంది. దీంతో అతను ఉంటున్న రూమ్‌ను తాళం వేసి సీజ్ చేశారు. అనంతరం అతడిని సస్పెండ్ చేసి విచారణకు క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, కర్నూలు మెడికల్ కాలేజి ఏడీ అనిల్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు.

ఉద్యాన రైతులకు సోలార్ కోల్డ్ రూములు

5 కిలోవాట్ల సామర్థ్యంతో రూపకల్పన
- 10 టన్నుల కూరగాయలు, పూల నిల్వకు అవకాశం
- 75 శాతం సబ్సిడీతో మంజూరు



జిల్లాలో నెలకొల్పిన సోలార్ కోల్డ్‌రూము

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలైన కూరగాయలు, పూలు నెల రోజుల వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉద్యానశాఖ ప్రత్యేకంగా కోల్డ్ రూములు నిర్మిస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) కింద 75 శాతం సబ్సిడీతో వీటిని నిర్మిస్తున్నారు. విద్యుత్ అవసరం లేకుండా కోల్డ్ రూములు సోలార్‌తో పనిచేయనుండటం విశేషం. 5 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ కోల్డ్ రూములను ఈ ఏడాది ఉద్యాన శాఖ పెద్ద ఎత్తున నెలకొల్పుతోంది. 10 టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న సోలార్ కోల్డ్‌రూములను ప్రత్యేకంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంజూరు చేస్తున్నారు. యూనిట్ కాస్ట్ రూ.15.50 లక్షలు ఉండగా.. ఎంఐడీహెచ్ కింద 35 శాతం, ఆర్‌కేవీవై కింద 40 శాతం సబ్సిడీ లభిస్తోంది. 25 శాతం రైతు ఉత్పత్తిదారుల సంఘాలు భరించాల్సి ఉంటుందని ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు తెలిపారు. ఇప్పటి వరకు 12 మంజూరు చేశామని, త్వరలోనే ఒక కోల్డ్‌రూమును ప్రారంభిస్తామన్నారు. కోల్డ్‌రూములో నిల్వ చేసుకునే పంటలను బట్టి ఉష్ణోగ్రతలను మొబైల్ ద్వారా సర్దుబాటు చేయవచ్చన్నారు. కోల్డ్‌రూములు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత ఉద్యాన అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.

బెట్ట నుంచి పంటలను కాపాడుకుందాం



డీఏవో పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావ పరిస్థితుల్లో బెట్ట నుంచి పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వివరించారు. పత్తి శాఖీయ దశ నుంచి కాయ పగిలే దశలో ఉందని.. బెట్ట నుంచి కాపాడుకునేందుకు లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేటు, 20 గ్రాముల యూరియా ద్రావణాన్ని 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పూత, కాయ రాలినట్లు గమనిస్తే 1 గ్రాము ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటికి కలుపుకొని అవసరాన్ని బట్టి 10–15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు.

- వేరుశనగ పైరు పూత దశలో ఉన్నందున లీటరు నీటికి 20 గ్రాముల యూరియాను కలిపి పిచికారీ చేయాలన్నారు. బెట్ట పరిస్థితుల్లో లీటరు నీటికి పొడి సున్నం 50 గ్రాముల చొప్పున కలిపి పంటపై పిచికారీ చేసి మొక్కల ద్వారా ఆవిరైపోయే నీటి నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగలో వేరుకుళ్లు ఆశిస్తుందని, దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి పొడి మందును లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ తడిచే విధంగా పోయాలన్నారు.
- కంది పంట బెట్టకు గురైతే లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేటు, 20 గ్రాముల యూరియా ద్రావణాన్ని పై పాటుగా పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదంలో బెట్ట పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల వల్ల వేరుకుళ్లు, మసికుళ్లు ఆశిస్తుందని, దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి పొడిమందును లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ తడిచేలా పోయాలని సూచించారు.

8వ రోజు 387 మంది ఎంపిక



డిజిటల్ యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్


కర్నూలు: ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ మైదానంలో 8వ రోజు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో శనివారం జరిగిన ఈ పోటీలకు 800 మంది అభ్యర్థులను పిలువగా 550 మంది హాజరయ్యారు. వీరికి ధ్రువపత్రాల(సర్టిఫికెట్లు) పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగుతో పాటు లాంగ్‌జంప్ పరీక్షలు చేపట్టారు. ఆయా పోటీల్లో ప్రతిభను కనపరచి 387 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు(మెయిన్స్) అర్హత సాధించారు.

జెడ్పీలో కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు(అర్బన్): రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ఏపీపీఎస్సీ నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ పరీక్షల ఫలితాల అనంతరం విడుదల చేసిన మెరిట్ లిస్టు మేరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం శనివారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో నిర్వహించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు జె. రంగలక్ష్మీదేవి, పి.వెంకటలక్షుమ్మ, ఎస్. శ్రీనివాసకుమార్‌తో పాటు రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు హాజరై సర్టిఫికెట్లను పరిశీలించారు. మొత్తం 54 పోస్టులకు సంబంధించి మెరిట్, రిజర్వేషన్ నిబంధనల మేరకు 1:2 రేషియో ప్రకారం 108 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు సమాచారం అందించగా,106 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

సాక్షి
ఫ్యామిలీ
కర్నూలు
ఆదివారం ॥ 3-9-2023

వైరల్



పారుఖ్ ఖాన్ · నయనతార · రజనీకాంత్

ఏది నిజం ఏది ఏఐ ఓ ట్విట్టరూ..!



రాధికా ఆప్టే

'ఎవరి చిన్నప్పటి ఫొటోలు వారికి ముద్దు' అని లోకం అనుకున్నా సరే అవి అంటే మనకు ఎంతో ఇష్టం.

ఇక సెలబ్రిటీల చిన్నప్పటి ఫొటోలు ఎప్పుడూ హాట్ ఫేవరెట్టే! ఒకప్పుడు 'ఇవిగో మీ అభిమాన హీరో చిన్నప్పటి ఫోటో' అంటే ఆశ్చర్యానందాలతో చూసేవాళ్లం.

ఇప్పుడు మాత్రం ఏఐ పుణ్యమా అని నమ్మడానికి లేదు. ఏది నిజం ఏది ఏఐ!

ఏఐ టెక్నాలజీ హవా చూస్తుంటే ఇక ముందు హీరో, హీరోయిన్‌ల చిన్నప్పటి పాత్రలు బాల నటులు వేయాల్సిన అవసరం లేదని అనిపిస్తుంది. ఇంటర్నెట్‌లో హల్ చల్ చేస్తున్న షారుఖ్ ఖాన్, రజనీకాంత్, నయన తార, మోహన్‌లాల్... చిన్ననాటి ఫొటోలే దీనికి నిదర్శనం. కాస్త సరదా అంశ కూడా వీటికి చేర్చడం వల్ల ఇవి ఏఐ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఇమేజ్‌లు అని తెలిసిపోతుందిగానీ...లేకపోతే శానా కష్టం సుమీ!

మదర్ పవర్= డివైన్ పవర్

పిల్లల చదువు, పెంపకంలో తల్లిపాత్ర కీలకమైనది. తల్లి దినచర్యలో పిల్లలతో హోంవర్క్ చేయించడం ఒక భాగం. అయితే అందరు తల్లులకు ఇది వీలవుతుందా?

కాకపోయినా... తప్పదు కదా! అంటుంది ఈ తల్లి,

రోడ్డు పక్కన బండిపై పండ్లు అమ్ముకునే ఒక మహిళ, బండి పక్కన నేలపై కూర్చొని పిల్లలతో ఓపిగ్గా హోం వర్క్ చేయిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఈ వీడియోకు కాప్షన్ ఇవ్వడానికి పదాలు రావడం లేదు' అని రాస్తూ ఝార్ఖండ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్ ఈ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

'ఈ రోజు పడే కష్టమే రేపటి విజయం' అని నెటిజనాలు ఆ తల్లిపై ప్రశంసల జల్లు కురిపించారు.

'మదర్ పవర్ ఈజ్ డివైన్ పవర్' అని ఒకరు రాశారు.







ఆదిత్య ఎల్1 మిషన్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన సందడి ఆకాశంలోనే కాదు అంతర్జాలంలోనూ కనిపిస్తోంది. సూర్యుడి చుట్టూ పరిభ్రమించిన సైన్స్-ఫిక్షన్ నుంచి సినిమాల వరకు ఎన్నో విషయాలు అంతర్జాలంలో చక్కర్లు కొడుతున్నాయి. మచ్చుకు ఫేస్‌బుక్‌లో ఒక వీడియో... **జర్నీ టు ది ఫార్ సైడ్ ఆఫ్ ది సన్(1969) సినిమా తాలూకు ట్రైలర్ ఇది.**

'అపోలో హ్యాజ్ కాంకర్డ్ ది మూన్'

'వేర్ టూ నౌ ఇన్ స్పేస్?' టైటిల్స్‌తో ట్రైలర్ మొదలవుతుంది. ఆ తరువాత... ఒక రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళుతుంది.

ఇప్పటి సినిమాలకు ఏమాత్రం తగ్గని ఉత్కంఠ ఈ ట్రైలర్‌లో కనిపిస్తుంది. 'నాట్ ది ఎండ్' అని ఊరిస్తూ ట్రైలర్ ముగుస్తుంది.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్



దిక్కుల దివ్వగీతాలకు వారసులు, లోకపు భాగ్య విధాతలు పిల్లలు.

పాపం పుణ్యం తెలియని ఈ పాపలకు ప్రమాదం ఏ రూపంలో ఉంటుందో తెలియదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'బ్యాడ్ టచ్ గుడ్ టచ్' గురించి పిల్లలకు సింపుల్ లాంగ్వేజ్‌లో, సులభంగా అర్థమయ్యేలా ఒక టీచర్ చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'షేర్ ఇట్ యాజ్ మచ్ యాజ్ యూ కెన్'

'ఈ వీడియోను ప్రతి స్కూల్లో పిల్లలకు చూపించాలి'... అంటూ నెటిజెన్స్ స్పందించారు.

రోషన్ రాయ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 1.7 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'సీక్రెట్ కోడ్'

ఫోన్ పే వచ్చాక వింతలూ విశేషాలూ బాగానే వైరల్ అవుతున్నాయి. చిన్నా చితక వ్యాపారులు స్కాన్ కోడ్‌ను రకరకాలుగా వేళ్లాడగడుతుంటారు. కాని ఈమె ఏకంగా తూకం గిన్నెకే అంటించింది. మహారాష్ట్రలో కూరగాయలామె చేసిన పనికి కోటి ఇరవై లక్షల వ్యూస్ వచ్చాయి. నెటిజన్లు 'భేషైన ఐడియా' అంటున్నారు. మామూలుగా రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునేవారు క్యూఆర్ కోడ్ స్టాండ్‌ను పెట్టుకుంటారు. అయితే ఆ ఖర్చు కూడా ఎందుకనుకుందో ఈ కూరగాయలామె కోడ్ కాగితాన్ని తూకం గిన్నె కింద అంటించేసింది. ఈ వీడియోలో వేరుశనక్కాయలను తూకం వేసిన ఆమె కొన్న వ్యక్తి సంచిలో వాటిని పోసి, అతను ఫోన్ పే ఉందా అనగానే టక్కున గిన్నె ఉల్టా చేసి చూపింది. ఆ స్టయిల్‌కు, ఆలోచనకు అందరికీ నవ్వు, ముచ్చటా కలుగుతున్నాయి. విపరీతంగా ఈ వీడియోను చూస్తున్నారు.



సుకుమారి సూపర్ స్టంట్స్

పాపులర్ ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్ మిష్ శర్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో 7.8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

స్టన్నింగ్ వీడియోలతో సోషల్ మీడియాలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది శర్మ. తాజా విషయానికి వస్తే... చీర ధరించి అద్భుతమైన రీతిలో చేసిన జిమ్నాస్టిక్స్ నెటిజనుల చేత 'వావ్' అనిపించాయి.



మరో అథ్లెట్ పారుల్ శర్మ చీర ధరించి చేసిన జిమ్నాస్టిక్స్ అబ్బురపరిచాయి.

'మన టాలెంట్ ముఖ్యం కానీ ఎలాంటి దుస్తులు ధరించామనేది ముఖ్యం కాదు' అని ఒకరు కామెంట్ రాశారు.

అయితే పారుల్ మాత్రం తన వీడియో చూసి ప్రయోగాలు చేయవద్దని సలహా ఇచ్చింది. 'స్టంట్స్ చేయడానికి ఉత్సాహం మాత్రమే సరిపోదు. ఒకస్థాయి వరకు శిక్షణ తీసుకోవడం అవసరం. నైపుణ్యం సాధించిన తరువాతే ప్రయత్నించాలి. లేని కష్టాలు కొని తెచ్చుకోవద్దు' అని చెప్పింది పారుల్.

సినిమా



● మృణాల్ ఠాకూర్, బేబీ కియారా, నాని

కున్నూర్‌లో హాయ్ నాన్న

కున్నూర్‌కు మకాం మార్చారు నాని. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతూ, నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'హాయ్ నాన్న'. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రుతీహాసన్, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నాని కూతురి పాత్రను కియారా ఖన్నా చేస్తోంది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ కున్నూర్‌లో ప్రారంభమైంది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని హీరో నాని వెల్లడించారు. నానీతో పాటు ముఖ్య తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు శౌర్యువ్. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో డిసెంబరు 21న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

మాలీవుడ్ ఎంట్రీ

మలయాళ పరిశ్రమలో తొలి అడుగు వేశారు హీరోయిన్ అనుష్కా శెట్టి. దాదాపు ఇరవయ్యేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అనుష్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తొలి మలయాళ సినిమా 'కథనార్: ది వైల్డ్ సోర్సెరర్'. ఫ్యాంటసీ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో జయసూర్య హీరోగా నటిస్తుండగా, రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరో జయసూర్య (సెప్టెంబర్ 2) బర్త్ డే సందర్భంగా 'కథనార్' సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. వీడియోలో అనుష్క కనిపించకపోయినా, ఆమె పేరును కన్ఫార్మ్ చేశారు మేకర్స్. వాస్తవ ఘటనల ఆధారంగా కేరళలోని కడమట్టు ప్రాంతంలో గల ఓ చర్చి ఫాదర్ జీవితం ఆధారంగా ఈ సినిమా ఉంటుందని టాక్. ఈ చిత్రం పద్నాలుగు భాషల్లో విడుదల కానుందట. రెండు భాగాలుగా రిలీజ్ కానున్న ఈ సినిమా తొలి భాగం 2024లో విడుదల కానుంది. ఇదిలా ఉంటే...

'కథనార్' గ్లింప్స్ వీడియోను బట్టి ఈ చిత్రంలో 'అరుంధతి' తరహా పాత్రను అనుష్క చేస్తున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి.



● అనుష్క

భూమి ఉన్నంత వరకే రాజు



● విజయ రాఘవేంద్ర, ఉదయ్ కుమార్

'సూడుండయ్యా... రైతు భూమి ఉన్నంత వరకే రాజు. ఒక్కసారి ఆ భూమి అమ్ముకున్నామా.. అదే భూమికి కూలీలమైపోతాం' అనే డైలాగ్‌తో విడుదలైంది ''111 గ్రీన్ జోన్' సినిమా కాన్సెప్ట్ టీజర్. సినిమా బండి క్రియేషన్స్, యుపిక్ క్రియేషన్స్ పతాకాలపై విజయ రాఘవేంద్ర దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. శనివారం ఈ సినిమా కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ రాఘవేంద్ర మాట్లాడుతూ– ''మంచి ఉద్దేశంతో తీసిన చిత్రం '111 గ్రీన్‌జోన్'. మంచి సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకుని వెళ్లాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''కంటెంట్ పరంగా '111 గ్రీజ్ జోన్' మూవీ చాలా ప్రత్యేకమైనది. మన సంస్కృతితో ముడిపడిన చిత్రం ఇది'' అన్నారు సంగీత దర్శకుడు లియాండర్ లీ. ఈ కార్యక్రమంలో వీఎఫ్ఎక్స్ చంద్ర, లిరిక్ రైటర్ చిత్రన్ మాట్లాడారు.

ట్రిపుల్ బొనాంజా

'ఈగ', 'బాహుబలి', 'సైరా: నరసింహారెడ్డి' వంటి సినిమాలతో కన్నడ నటుడు కిచ్చా సుదీప్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. శనివారం (సెప్టెంబరు 2) సుదీప్ బర్త్ డే. ఈ సందర్భంగా సుదీప్ మూడు చిత్రాలను ప్రకటించి, తన అభిమానులకు ట్రిపుల్ బొనాంజా ఇచ్చారు. సుదీప్ హీరోగా ఆర్. చంద్రు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' సినిమాలకు కథ అందించిన రచయిత వి. విజయేంద్రప్రసాద్ ఈ సినిమాకు స్క్రిప్ట్ విజన్ చేస్తుండటం విశేషం. ఆర్‌సీ స్టూడియోస్ నిర్మించనున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. 2024లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.



● సుదీప్

పదేళ్ల తర్వాత...

ఇప్పటివరకూ సుదీప్ ఆరు చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'మాణిక్య' (2014) తర్వాత దర్శకుడిగా సుదీప్ మరో సినిమాకు మెగాఫోన్ పట్టలేదు. అయితే పదేళ్ల తర్వాత సుదీప్ నటిస్తూ, ఓ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు టాక్.

మ్యాక్స్

సుదీప్ హీరోగా విజయ్ కార్తికేయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాకు 'మ్యాక్స్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. వి క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్ పతాకాలపై కలైపులి యస్. థాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

హెల్త్

చిన్నారుల్ని ఇబ్బంది పెట్టే హ్యాండ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్!



హ్యాండ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ చిన్నారుల్లో కనిపిస్తుంటుంది. ఈ వ్యాధిలో పిల్లల చేతులు, కాళ్లు, నోటి మీద ర్యాష్, పొక్కులు, పుండ్ల లాంటివి వచ్చి బాధపెడతాయి. ఈ వైరస్ వ్యాప్తి విస్తృతంగా ఉన్నప్పుడు... ఔట్‌బ్రేక్స్ మాదిరిగా అకస్మాత్తుగా పిల్లల్లో అంటువ్యాధిలా వ్యాపిస్తుంది. ఏడాది పొడవునా ఎప్పుడైనా వ్యాప్తి చెందే ఈ వ్యాధి వాతావరణంలో వేడిమీ, తేమ ఎక్కువగా ఉన్నప్పుడు వస్తుంటుంది. అందుకే మనలాంటి ఉష్ణమండలపు ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువ. రోజుల వయసు పిల్లలు మొదలుకొని, పదేళ్ల చిన్నారుల వరకు కనిపించే ఈ సమస్య తల్లిదండ్రుల ఆందోళనకూ కారణమయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధిపై అవగాహన కోసం ఈ కథనం.

హ్యాండ్ ఫుట్ మౌత్ డిసీజ్‌లోని ర్యాష్, పుండ్లు, కురుపుల్లో నొప్పి ఓ మోస్తరుగా, కాస్త ఎక్కువగానే ఉండవచ్చు. దేహం రంగు (స్కిన్ టోన్)ను బట్టి ఈ కురుపులు, పుండ్లు పిల్లలందరిలో ఒకేలా కాకుండా కాస్త వేర్వేరుగా కనిపించవచ్చు. అంటే ఎరుపు, గ్రే కలర్, కొన్నిసార్లు తెలుపు రంగులో కనిపిస్తాయి. ఇవి మూడు నుంచి ఆరు రోజుల వరకు కనిపించి, ఆ తర్వాత వాటంతట అవే తగ్గిపోతాయి. కొంతమంది పిల్లల్లో పిరుదుల మీదా కనిపించే అవకాశం ఉంది. పుండ్లు పిల్లల్లో నోటి వెనకా, గొంతులోనూ వచ్చి బాధిస్తాయి. ఇలా జరగడాన్ని 'హెర్పాంజియా' అంటారు. కొంతమందితో మెదడువాపు లక్షణాలు కనిపిస్తాయి.



వ్యాప్తి ఇలా...

'కాక్సాకీ' అనే వైరస్ కారణంగా ఈ వ్యాధి వ్యాప్తిచెందుతుంది. ఇది ఎంటరోవైరస్ జాతికి చెందిన వైరస్. పిల్లల ముక్కు నుంచి స్రవించే స్రావాలు, లాలాజలం, పుండ్ల నుంచి స్రవించే తడితో పాటు పిల్లలు తుమ్మడం, దగ్గడం చేసినప్పుడు వ్యాపించే తుంపర్ల (డ్రాప్‌లెట్స్) వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంటుంది. వ్యాధి నయమై, లక్షణాలు తగ్గిపోయాక కూడా వైరస్ చాలాకాలం పాటు దేహంలోపలే ఉండి, వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే అవకాశం ఉంది. ఒక్కోసారి పిల్లలతో ఉండే పెద్దల ద్వారా ఇతర పిల్లలకు ఇది వ్యాప్తి చెందవచ్చు.

అరుదుగా ముప్పు...

చాలావరకు దానంతట అదే తగ్గిపోయే ఈ వ్యాధి అరుదుగా కొంతమంది పిల్లల్లో ముప్పు తెచ్చిపెట్టవచ్చు. పిల్లల వయసు అనే అంశమే ఈ ముప్పునకు కారణం. అంటే సాధారణంగా ఐదేళ్లలోపు పిల్లల్లో ఇది ఒకింత ప్రమాదకరం అయ్యే అవకాశం ఉంది. వయసు పెరుగుతున్న కొద్దీ పిల్లల్లో వ్యాధి నిరోధకత (ఇమ్యూనిటీ) కూడా పెరుగుతుంది కాబట్టి పెద్ద వయసు పిల్లల్లో ఇది ప్రమాదకరం కాబోదు. కొద్దిమంది పిల్లల్లో మెదడు, ఊపిరితిత్తులు, గుండె కూడా దుష్ప్రభావాలకు లోనవుతాయి. ఒక్కోసారి ఈ వ్యాధి తెచ్చిపెట్టే ముప్పులు ఈ కింది విధంగా ఉండవచ్చు.

వైరల్ మెనింజైటిస్ : మెదడు పొరల్లో వాపుతో పాటు, మెదడు చుట్టూ ఉండే సెరిబ్రో స్పైనల్ ఫ్లుయిడ్‌లో ఇన్‌ఫ్లమేషన్ కలగడం.

ఎన్‌సెఫలైటిస్ : మెదడువాపునకు కారణమై ఒక్కోసారి ప్రాణాపాయం వరకు వెళ్లే పరిస్థితి రావచ్చు. అయితే ఇది చాలా చాలా అరుదు.

లక్షణాలు

● వైరస్ కారణంగా 24 నుంచి 48 గంటల పాటు జ్వరం. ● తీవ్రమైన నీరసం, నిస్సత్తువ. ● ఆకలి లేకపోవడం, ఆకలి బాగా మందగించడం. ● గొంతు బొంగురుపోవడం, ఇబ్బందికరంగా మారడం. ● కొన్నిసార్లు ర్యాష్, పొక్కులు, కురుపులు చిగుర్లు, నాలుక, చెంపల లోపలివైపున కూడా కనిపించవచ్చు. కొన్నిసార్లు పొక్కులు, కురుపులు లేకుండా ఎర్రబడిన భాగం కాస్త ఉబ్బెత్తుగా అయినట్లుగానూ కనిపించవచ్చు.

నివారణ

● కనీసం 20 సెకండ్ల పాటు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. హ్యాండ్ శానిటైజర్ వాడాలి. ● నేరుగా దగ్గడం తుమ్మడం చేయకుండా, చేతిగుడ్డ / రుమాలు అడ్డుపెట్టుకోవాలి. ● వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిశుభ్రమైన (కాచి, వడబోసిన లేదా క్లోరిన్‌తో బ్లీచ్ చేసిన) నీటిని తాగాలి. ● పిల్లల వ్యక్తిగత వస్తువుల్నీ పరిశుభ్రంగా ఉంచాలి. వారి డయపర్ వంటి వాటిని జాగ్రత్తగా పారేయాలి (డిస్పోజ్ చేయాలి). ● పిల్లల వస్తువులు, బొమ్మల వంటివి... ఇతరులు వాడకుండా జాగ్రత్తపడాలి. ● లక్షణాలు తగ్గే వరకు స్కూల్‌కు పంపకపోవడమే మంచిది. ● వ్యాధి వ్యాప్తి చెందుతున్నప్పుడు ఇల్లు, తలుపులు, డోర్ నాబ్స్ వంటి వాటితో పాటు పరిసరాలనూ డిస్-ఇన్ఫెక్టెంట్ల సహాయంతో శుభ్రం చేయడం మేలు.

చికిత్స

ఇది వైరల్ జ్వరం కాబట్టి నిర్దిష్టంగా చికిత్స ఏదీ లేదు. కాకపోతే లక్షణాల ఆధారంగా చికిత్స (సింప్టమేటిక్ ట్రీట్‌మెంట్) అందించాల్సి ఉంటుంది. అంటే జ్వరం తగ్గడానికి పారాసిటమాల్, డీ-హైడ్రేషన్ సమయంలో ఐవీ ఫ్లుయిడ్స్, సీజర్స్‌వంటి కాంప్లికేషన్లతో పాటు వైరల్ మెనింజైటిస్, ఎన్‌కెఫలైటిస్ కనిపించినప్పుడు వాటికి అనుగుణంగా చికిత్స అందించడం అవసరం. ఈ వ్యాధి నివారణకు టీకా రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



డా॥ రమేశ్ బాబు దాసరి,
సీనియర్ పీడియాట్రీషియన్